# తెలివి ఒక్కడి సొమ్మంటే....



* శ్రీ మంతెన సూర్యనారాయణ రాజు *

"అమ్మా! ఆకలైతోందే!" అంటూ తల్లి కాళ్ళకు చుట్టుకుపోతూ చెప్పింది ఐదేళ్ళ రామి. పోశమ్మకి గుండెలో ఎవరో చెయ్యిపెట్టి దేవినట్లయింది. చంకనున్న తొమ్మిది నెలల పసికందు ఎంకటి పాలులేక 'కేర్ కేర్' మంటూ ఏడుస్తోంది. ఇద్దరిలో యెవర్నీ సముదాయించగలదు. అటు పసిబిడ్డకు పాలిద్దామంటే చిక్కి శల్యమైన శరీరంలో అవి ఘనీభవించిపోయాయి. అటు రామికి గంజి కాద్దామన్నా నూకలు లేవు. భర్త యాదగిరి బస్తీకెళ్ళి మూడు రోజులయ్యింది

అల్లంత దూరంలో సర్కారోళ్ళు ఏర్పాటు చేసిన కిరాయి లారీ కనిపిస్తోంది. ఢిల్లీ నుంచి యెవరో మంత్రిగారొస్తున్నారని మందిని పోగేసుకెళ్తున్నాడు దళారీ. క్రిందటి రోజునే పోశమ్మలాంటి పూటకు గతీలేని వాళ్ళనందర్నీ తీసికెళ్ళి మస్తుగా బువ్వ తినిపిస్తానని, రోజుకూలి పైసలిప్పిస్తానని బేరం కుదుర్చుకెళ్ళాడు. అందుకే ఈ రోజింత మబ్బుల్లో లారీ తీసుకొని వచ్చాడు అనుకుంది. ఒప్పుకున్న వాళ్ళంతా ఎక్కడం చూసింది. దళారీ సరాసరి తన దగ్గర కొచ్చి 'ఎక్కన్ని జల్దీ!' అంటూ గట్టిగా అరిచాడు. పోశమ్మ కడుపు కక్కుర్తి కొద్దీ లారీ ఎక్కుతూంటే "నీతో అల్లిద్దర్నీ తోల్కులావడమెందుకు మల్ల" అంటూ కోపడ్డాడు.

'అల్లకోసమేగా నేను గాసారం తక్కువై నీ ఎన్క వచ్చేడిది. పొద్దుగాల్నుంచి ఎవ్వారేం తిన్లేదు, తాగలేదు' అంది.

వాడు బీడీ అంటిస్తూ నెత్తిమీద గోష్పాదమంత జుట్టు సరుకుంటూ 'నీ యవ్వ! ముగ్గురూ తింటే పైసల్ గిడుతయ్యాని నీ యెత్తు. ఎక్కు మల్ల లొల్లి సేయక' అన్నాడు. ఎక్కిన వాళ్ళని ఎవర్నీ కాదనకుండా లారీని నిమిషాలమీద పూడ్చేసాడు. అప్పటిదాకా కంకర తోలిన క్యారీలారు ఏమో ఎక్కిన వాళ్ళకు గతుకుల్లో పడ్డప్పుడు కంకరబూడిద మీద పడుతోంది. జారగిలిబడి కూర్చున్న వాళ్ళకు బట్టలన్నీ ఖరాబైపోయాయి. పోశమ్మకు కడుపులో ఆత్మారాముడు ఆకలి ఆకలంటూ గగ్గోలు చేస్తున్నాడు. క్రితం రాత్రి తిన్న గంజిమెతుకులు. అవెప్పుడో అరాయించుకుపోయివుంటాయి. తెల్లారి ఏం తిన్లే! తాగలేదు. శోష వచ్చి పడిపోయేలాగుంది. గత్యంతరం లేక నాలుకతో పెదాలు తడుపుతుంది.

రామి తల్లికి తన పొట్ట చూపిస్తూ ఆశాపూరిత నయనాలతో 'ఆకలైతాంది. బువ్వ కావలె' అని అడి

గింది. 'సప్పుడు సేయకు మల్లా. పట్నం బోతునంగ. అడ కడుపు నిండ బువ్వ తినిపిస్త చుప్' అంటూ గుడ్లురిమింది పోశమ్మ. రామి మాట్లాడలేదు. అందర్నీ ఒకచోట దింపి అన్నం పొట్లాలు పంచాడు దళారీ. అంతా ఆబగా నోట్లలేసుకుంటూ తింటున్నారు. చెప్పినంత గొప్పగ ఏంలేదా కూడు. రుచీపచీ లేని గడ్డి. ఎంతో ఎదురు చూస్తున్న పోశమ్మకు రెండే పొకెట్లిచ్చాడు. ఇంకోటివ్వమని చంకలో బిడ్డని చూపుతూ పోశమ్మ చెయ్యి చాచింది.

"నీ యవ్వలమ్మి! నీకు రెండే దండగ. హేట్" అంటూ ఆమె చెయ్యి ప్రక్కకుగెంటి మరీ ముందు కెళ్ళిపోయాడు. అంతా ఆహారం పొట్లాలతో అర్ధాకలిని అణుచుకొని సగం కడుపులు నింపుకున్నారు.

కడుపు నిండ బువ్వ బెట్టిస్తానని చెప్పి దళారోడు దగా సేసిండు అంటూ అంతా చెవులు కొరుక్కున్నారు. లొల్లిబెడితే పంచాయితీ అయితది. ఆనక పైసలెగనూకుతాడు నిజడిసారు. పోశమ్మ తానో పొట్లం తిని, రెండో పొట్లంలో రామికి కొంత పెట్టి చంకనున్న బిడ్డకి గోరుముద్దలు తినిపించింది. నీల్ల దగ్గర కెళ్ళి మిగిలిన ఆకలి బాపుకోడానికి నీరు తాగి తిరిగొచ్చారు. తన వెనక వచ్చినామె నీళ్ళు తాగుతుండగానే నీళ్ళు కూడా బందయిపోయింది. కొందరు దళారిని "నీళ్ళు నీళ్ళు తాగనాకు నీళ్ళు లేకుండా ఏందివయ్యా యిది" అంటూ గుసాయించారు. దళారీ దాన్ని బాగుచేయించాడు.

మంత్రిగారు విమానంలో దిగి అక్కణ్ణించి కారులో సభాస్థలికి పోలీస్ ఎస్కార్టుతో వెళ్ళేటప్పటికి రెండు గంటలయ్యింది. అందరి నడినెత్తి చుర్రుమంటోంది ఎండ వేడిమికి. మంత్రిగారు పీటో పెట్టుకున్నారు. తనకోసం కట్టినటెంట్ హౌస్ తాలూకు గుడ్డపందిరి క్రింద నిలబడి అరగంట ఊకదంపుడు ఉపన్యాసం దంచాడు. ఆయనగారలా వెళ్ళగానే అధికారయంత్రాంగం ఆయన కూడా కదిలింది. దళారీ మళ్ళీ లారీస్పాట్ దగ్గరకు తీసుకొచ్చి "జల్దీ ఎక్కన్డి" అంటూ కేకలేసాడు. అంతా కూడబలుక్కున్నట్లు "పైసల్" అని అడిగారు. 'ఇండ్లకు తీస్కొల్లినంక. డ్రైవర్ సాబ్ పోనియ్ గాడీని' అన్నాడు. లారీ తిరుగుముఖం పట్టింది.

దిగిపోతుండగా ఒక్కొక్కళ్ళ ముఖం జూసి పిల్లలైతే ఐదు, పెద్దలైతే పది ఇస్తూ ఏదో యిచ్చామన్నట్లు చేత్తోనే లేదనిపించేస్తున్నాడు దళారీ! ఎవరెంత అరిచి గీపెట్టినా ఖాతరు చెయ్యల్లేదు. పాతికో పరకో ఇస్తారనుకున్నది అందరీ తగ్గించేయడంతో మండింది జనానికి. పోశమ్మ బిడ్డల్తోబాటు దిగింది. చెయ్యి చాపింది. ఏడు రూపాయలిస్తూ 'నీకు రెండు పాకెట్లిచ్చిన' అంటూ ఆమె చెయ్యి దూరంగా గెంటేసాడు ఇంక యిచ్చేది లేనట్లు. 'దొరా! ఇంకో మూడియ్యి నీ కాల్మొక్త' అంటూ వుండబట్టలేక అడిగింది. "పొట్లామెచ్చి పాంచ్ రూపాయి. రెండూ దస్ రూపాయి. అందరికన్నా నీకెక్కువే ముట్టింది పోమల్లా!" అంటూ లారీ ముందుకు పోనిమన్నాడు.

కడుపు మండిన కొంతమంది లారీ ముందు చక్రాలపై గునపాలతో, గొడ్డళ్ళతొ నరికారు. రెండు చక్రాల్లో గాలి 'తుస్ససస్సూ' అంటూ అవి రెండూ చతికిలబడిపోయాయి. డ్రైవర్ లారీ ఆపేసాడు. జనం పిక్కబలం చూపి ఎవరిమటుక్కు వారు పారిపోయారు. "ఎవర్రా పంప్‌చార్ సేసిండు, బేవ్కూఫ్" అంటూ దళారీ డ్రైవర్ లారీ క్లీనర్ దిగి మొత్తుకున్నారు, రెండు టైర్లూ రీబటనింగుకూడా పనికిరావని గ్రహించి లాభం గూబల్లో కొచ్చినందుకు లోలోన ఏడ్వం తప్పింది కాదు,

★

Edited and Published by A. N. Raghavachar, No 10, Murugesa Mudali St., Madras-79.
Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47, Badrian St., Madras-600 001.